



# కరపత్రం

SINCE 2014

బుధవారం జూన్ 25 2025 | సంపుటి :0 | సంచిక :250 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారం

## 18 నెలల కాంగ్రెస్ పాలన గోల్డెన్ పీరియడ్



- రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంది
- కులగణనతో మోడీకి సవాల్ విసిరిన ఘనత మనదే
- నామినేటెడ్ పోస్టులు పొందిన వారు బాగా పనిచేయాలి
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని అధిష్టానం సూచిస్తుంది
- పార్టీ క్రమశిక్షణ తప్పిన వారిపై వేటుకు వెనకాడం
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

**హైదరాబాద్,జూన్24**

పదేళ్లపాటు తెలంగాలో కాంగ్రెస్‌దే అధికారమని, మరోమారు అధికారంలోకి తీసుకుని వచ్చేలా పార్టీనేతలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారు బాధ్యతలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత 18 నెలల కాంగ్రెస్ పాలన నిజంగానే గోల్డెన్ పీరియడ్ అన్నారు. రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు.'మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో కులగణన చేసి మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలి. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు. పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకే తీరని నష్టం అని సీఎం అన్నారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ ఉప ఎన్నికలో గెలవాల్సిందే అని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందరినీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు.

2లో..



# కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

## 9రోజుల్లో 9 వేల కోట్లు రైతు ఖాతాలో జమ

2లో..

## సన్నధాన్యం రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్

- రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,జూన్24:**

కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 9 వేల కోట్లు వేశామని చెప్పారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రూపంలో ఈరోజు వరకు 1,199 కోట్ల రూపాయలు రైతులకు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతన్నకు ఊహించని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు రైతు బీమా పథకాన్ని అమలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు భీమా అందించామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.



2లో

# ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

- రాజకీయాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణ
- భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష
- పటిష్టాంగా ఏర్పాట్లు చేయాల మంత్రి పొన్నం సూచన

**హైదరాబాద్,జూన్**

చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా అత్యతం వైభవంగా చేసుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:**

తెలంగాణ-ఫ్రెంచ్ మధ్య ద్వైపాక్షిక సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రతినిధులతో శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలతలు, ప్రోత్సాహకాలను వివరించారు. ఫ్రెంచ్ కంపెనీలు ఇక్కడికొచ్చేలా చొరవ చూపాలని కోరారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, గతేడాది హైదరాబాద్‌లో 70 జీసీపీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. టీజీ ఐపాస్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

# పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు



2 లో

**హైదరాబాద్:**

క్వారీ యజమానిని బెదిరించిన కేసులో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు.

# కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

## తమ ఫోన్లు ట్యాప్ చేసినట్లు వాంజ్ఞాలం

- నత్తనడకన సాగుతోన్న ట్యాపింగ్ కేసు
- బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆరోపణ



**హైదరాబాద్,జూన్24:**

దమ్ము, ధైర్యం లేక తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు నత్తనడక సాగుతోందని, బిజెపి, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వేగం లేదని అన్నారు. ప్రభాకర్ రావు నిబంధనలు అతిక్రమించి మాజీ సిఎం కెసిఆర్ కోసం పని చేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు.

మిగతాద్ది 2 లో

# విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

- రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు
- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాం: తుమ్మల

**హైదరాబాద్,జూన్24**

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళు _న్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డిలా వ్యవసాయంపై ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు.



మిగతాది 2లో

# 'గోదావరి-బనకచర్ల'పై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు



**హైదరాబాద్:**


స్థానిక ఎన్నికల్లో తమ గెలుపుపై నమ్మకం లేక కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా వేసిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా విజయోత్సవ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్ విసరడంపై ఆయన స్పందించారు. "గతంలో రూ. 80వేల కోట్లు రైతుల అకౌంట్లలో కేసీఆర్ వేశారు. వ్యవసాయాన్ని పండుగలా చేసిన కేసీఆర్‌ను ఉరి తీయాలని మాట్లాడతారా? సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు క్షమించరు.

# జిల్లాస్థాయికి వ్యాసరచన పోటీలకు ఎంపికైన వాసవి విద్యార్థి



**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ జూన్ 24**
బాన్సువాడ పట్టణంలోని వాసవి ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థి నిఖిల్ గౌడ్ మంగళవారం మత్తు పదార్థాల నిర్మూలనపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయి మొదటి బహుమతి సాధించడమే కాకుండా, జిల్లాస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థి నిఖిల్ గౌడ్ ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రంగంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని, విద్యార్థులు సమాజంలో మన ఉన్నత స్థాయికి ఎదగాలని వారికి ఎల్లప్పుడూ పాఠశాల యాజమాన్యం తోడ్పాటు అందిస్తుందన్నారు.

# విద్యాధికారులతో సబ్ కలెక్టర్ సమావేశం...





**కరపత్రం ప్రతినిధి బోధన్ జూన్24..**
బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో డివిజన్ లోని పోతంగల్, కోటగిరి, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా మండల విధ్యాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక సాహిత్యం, గణిత నైపుణ్యాలు కార్యక్రమం, అభ్యాసం అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై చర్చించారు. ఎఫ్.ఎల్.ఎన్.కార్యక్రమం 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదవడం, రాయడం గణితం ప్రాథమిక నైపుణ్యాలను బలపరచడం లక్ష్యంగా, లిప్ ఎల్.ఐ.పి.కార్యక్రమం 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థుల అభ్యాసంలో మెరుగుదల కలిగించేందుకు రూపొందించబడిందని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలు 2025 జూన్ 25 నుండి 30 వరకు నిర్వహించాలని తెలిపారు. డివిజన్ లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక నైపుణ్యాలను, మొత్తం విద్యా ప్రదర్శనను మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమాల ప్రాముఖ్యతను సబ్ కలెక్టర్ వివరించారు. ప్రతి మండలంలో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు శిక్షకులు చురుకైన భాగస్వామ్యం, క్రమబద్ధమైన ప్రణాళిక, నిరవధిక పర్యవేక్షణ తప్పనిసరి అని ఆయన మండల విద్యాధికారులను ఆదేశించారు.

# సమ్మె నోటీసు అందజేసిన మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ




సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

మున్సిపల్ కార్మిక సంఘాల (ఏఐటియూసి,టీయూసిఐ,సిఐటీయూ) జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మేనేజర్ జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వై.ఓమయ్య,టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్ బాబులు మాట్లాడుతూ,మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా,కనీస వేతనాల అమలు కోసం కనీస పెన్షన్ 9వేల అమలు కోసం,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు,డ్రైవర్లు,సిబ్బంది పాల్గొంటారన్నారు.మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి.హన్మండ్లు,రాధాకుమార్,భానుచందర్,డి.కిరణ్,ఎన్.రవికుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాట్‌లో ఆమ్రపాలికి ఊరట తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ ఆదేశాలు

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

క్యాట్‌లో ఐఎఎస్ అధికారి కాట్ర ఆమ్రపాలికి ఊరట దక్కింది. ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. తెలంగాణ నుంచి రిలీవై ఏపీ క్యాడర్‌లో చేరిన ఐఏఎస్ అధికారిణ కాటా ఆమ్రపాలికి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ క్యాట్‌ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తెలంగాణలో పని చేసిన ఆమె.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులతో నాలుగు నెలల క్రితం ఏపీకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకు కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అనుమతించిన క్యాట్.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె తిరిగి తెలంగాణకు వచ్చే అవకాశం ఉంది.

# ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

మొదటి పేజీ తరువాయి
అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరఫున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండుసార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి, ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

# కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

మొదటి పేజీ తరువాయి
హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. 'భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది.

# పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు

మొదటి పేజీ తరువాయి
సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ నెల 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఇవాళ్టికి (మంగళవారం)వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

# కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

మొదటి పేజీ తరువాయి
సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం అని చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయనున్నామని స్పష్టం చేశారు. 'నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాల 25 ఎకరాల్లో.. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు 11,600 కోట్లు కేటాయించాంరాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సన్న బియ్యం కోసం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇందుకుగాను తాజా బ్జడెట్లో 23,373 కోట్లు కేటాయించాం.' అని భట్టి వ్యాఖ్యానించారు.

# 'గోదావరి-బనకచర్ల'పై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి
గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదైనా చర్చించేందుకు సిద్ధం. రేవంత్‌రెడ్డి ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపిస్తాం"అని హరీశ్‌రావు అన్నారు.
పదేళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా ఉంటే.. ఏడాదిన్న కాంగ్రెస్ పాలనలో సాగు మళ్లీ దండగైందని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. "రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు దాన్ని రూ.12వేలకు కుదించడం సంబరమా?రైతుభరోసా రెండు సార్లు ఎగ్గొట్టారు. ఓట్ల కోసం ఆగమేఘాల మీద డబ్బులు వేయడం సంబరమా?కాంగ్రెస్ మోసాలకు గుణపాఠం తప్పదు"అని అన్నారు.

# విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

మొదటి పేజీ తరువాయి
కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రూ.2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశామని గుర్తుచేశారు. రైతునేస్తం సభలో ఆయన మాట్లాడుతూ..తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ కూడా కేంద్రంలో రూ. 4లక్షలు రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వరకు కూడా రైతుబంధు వేయలేదని.. కానీ ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని ఉద్ఘాటించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామంటే కొందరు నేతలు నమ్మలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు తెస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే రేవంత్ ప్రభుత్వం రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులను మరువబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇంకా చాలా పథకాలు తీసుకురాబోతుందని ఉద్ఘాటించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన తర్వాతనే తమకు ఓటు వేయమని అడుగుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిజంగానే ఈరోజు దేశ చరిత్రలో లిఖించదగిన రోజని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడం దేశ చరిత్రలో ఇంతవరకు ఎక్కడ జరగలేదని చెప్పారు. 'వ్యవసాయం అంటే కాంగ్రెస్. వ్యవసాయం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్ట్‌లు కట్టిందే కాంగ్రెస్. రైతుల కోసం ఉచిత కరెంట్‌ని, గిట్టుబాటు ధరను తెచ్చిందే కాంగ్రెస్. హరిత విప్లవాన్ని తెచ్చిందే కాంగ్రెస్. ఏ రాజకీయ పార్టీ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించలేదు. రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు. అందరి ఖాతాల్లో రూ.9000 కోట్లు వేస్తామని చెప్పామని.. అలానే వేశాం అని పేర్కొన్నారు.

# పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారం




మొదటి పేజీ తరువాయి
ఇక.. అభ్యర్థి ఎంపికకు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది. తామే అభ్యర్థులమంటూ కొంతమంది తేల్చిచెబుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత ఇచ్చారు. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని చెప్పారు. అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని సీఎం ఆదేశించారు. ఏ ఎన్నిక జరిగినా ఒకే పక్రియ ప్రకారం అభ్యర్థి ఎంపిక ఉంటుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కూడా అదే పక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఇక.. పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతోందని వారు చెప్పుకొచ్చారు. మరోవైపు నిన్న గాంధీ భవన్‌లో గొర్రెలతో నిరసన చేయడంపై సీఎం చాలా సీరియస్ అయ్యారు. గాంధీ భవన్‌లో ఇలాంటివి ఎంటర్ టైన్ చేయొద్దని ఆదేశించారు. నిరసనకు ఓ పరిమితి ఉంటుందన్నారు. కాంగ్రెస్ అందరి అభిప్రాయం తీసుకుంటుందని..
అందరినీ గౌరవిస్తుందన్నారు. ఇది పార్టీ ఆఫీసా ఇంకా ఏమైనానా అని గాంధీభవన్ ఆఫీస్ బేరర్స్‌ను ప్రశ్నించారు. ఇష్టా రీతిలో నిరసనలు చేస్తుంటే ఏం చేస్తున్నారు అని సీఎం ప్రశ్నించారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని సీఎం హెచ్చరించారు. అలాగే ఇంచార్జ్ మంత్రుల పనితీరుపై కూడా సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే భాధ్యత ఇంచార్జ్ మంత్రులకు అప్పగించినా చేయడం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇంచార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రుల దగ్గర ఫండ్స్ పెట్టామని, వాటిని సరిగ్గా ఉపయో గించడం లేదని పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్, భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ జమ్మికుంట పోలీస్ స్టేషన్ తనిఖీ









**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 24**
కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసీపీ మాధవి మరియు ఇన్స్పెక్టర్ నిరంజన్ పూల మొక్కను అందించి కమీషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డు అందించిన గౌరవ వందనం స్వీకరించారు.పోలీస్ స్టేషన్ హాజరు ఉన్న సిబ్బంది పరేడ్‌ను పర్యవేక్షించి, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి అందించిన కిట్లను తనిఖీ చేసి, కేటాయించబడిన రెయిన్‌జాకెట్ వంటి వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను పోలీస్ కమీషనర్ ప్రారంభించారు. ఈ కెమెరాలన్నీ పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించబడి, 24 గంటలపాటు రికార్డు అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని చోట్ల సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతామని జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ వెల్లడించినట్లు కమీషనర్ తెలిపారు. కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన ఇన్స్పెక్టర్ రామకృష్ణను పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధులు, రికార్డుల నిర్వహణ, (సి సి టీ ఎన్ ఎస్ )లో నమోదైన కేసుల వివరాలను సక్రమంగా పొందుపరచాలని సూచించారు.తెలంగాణ పోలీసులు వినియోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్ల జారీ, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాలు, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ వార్న్ కెమెరాలు వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని ఆదేశించారు.
ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. వాటికి గల కారణాలను తెలుసుకొని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకొని, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రామడుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్-సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు.
నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డు నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు వంటి విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు.
రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణలతో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్ పల్లిలో రైతు భరోసా సంబరాలు

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
ఇచ్చిన హామీ మేరకు, రాష్ట్ర ప్రభుత్వం, రైతు భరోసా స్కీం ద్వారా రైతులకు వారి ఖాతాలలో డబ్బులు జమ చేయడం పట్ల, పట్టణంలో కాంగ్రెస్ పార్టీ-రైతు నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆర్టీసి డిపో ముందు గల, రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుని, పటాకులు పేల్చారు. తర్వాత, పట్టణ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లింగం, అల్లూరి మహేంధర్ రెడ్డిలు మాట్లాడారు.మెట్‌పల్లి పట్టణం, మండలంలో మొత్తం 18వేల 72 మంది రైతులకు గానూ, 17కోట్ల 60లక్షల 97వేల 828 రూపాయలు రైతుల ఖాతాల్లో, రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు వారు తెలిపారు.అంతేగాక, రుణ మాఫీ, సన్నవడ్లకు బోనస్ చెల్లించడంతో, రైతులు సంతోషంగా ఉన్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పట్టణ కిసాన్ సెల్ అధ్యక్షుడు కొమ్ముల సంతోష్ రెడ్డి, మెట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి,మాజీ సర్పంచ్ లింగారెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు జెట్టి లక్ష్మణ్,సేవ దళ్ అధ్యక్షులు నాయిని సురేష, NSUI నాయకులు విజయ్,బొల్కం శివ,రైతు నాయకులు తుమ్మల లింగారెడ్డి,భూమారెడ్డి, రాజారెడ్డి, మహేందర్ జాకీర్, రాజగోపాల్,శంకర్ రమేష్ ,సూరి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా అడిషనల్ ఎస్పి ఇంటెలిజెన్స్ గౌస్ బాబా కు సన్మానం చేసిన మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



కరీంనగర్ జిల్లాలో మహమ్మద్ గౌస్ బాబా ఎస్సై స్థాయి నుండి అడిషనల్ ఎస్పీ స్థాయికి ప్రమోషన్లు పొంది కరీంనగర్ జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఎస్సై సీఐ ఏ సి పి స్థాయి నుండి కరీంనగర్ జిల్లాకు ఇంటలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొందిన మహమ్మద్ గౌస్ బాబాకు తెలంగాణ బిసి ఎస్సి ఎస్టి మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అడిషనల్ ఎస్పీ ప్రమోషన్ పొందిన మహమ్మద్ గౌస్ బాబాకు కలిసిన సందర్భంగా పూలతో పాటు శాలువా కప్పి సన్మానించి మహమ్మద్ గౌస్ బాబాకు శుభాకాంక్షలు తెలియజేసిన మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎస్సై స్థాయి నుండి అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్లు పొందిన మహమ్మద్ గౌస్ బాబా నీతి నిజాయితీతో ఎంతో మంచి పేరు గుర్తింపు పొందిన అధికారి మహమ్మద్ గౌస్ బాబా పోలీస్ శాఖలో పని చేస్తూ తను పనిచేసిన ప్రాంతాలలో ఎంతో మందికి న్యాయం చేశారు అక్కడ పనిచేసిన ప్రాంతాలలో ప్రజలు ఎంతో గౌరవం పొందిన వ్యక్తి మహమ్మద్ గౌస్ బాబా తన విధి నిర్వహణలో ఎంతో మంచి పట్టుదల ఉన్న వ్యక్తి కిందిస్థాయి ఉద్యోగి నుండి పై స్థాయి ఉద్యోగులకు ఎంతో మంచి మర్యాద గౌరవం ఇచ్చి వారి ద్వారా గౌరవం పొందిన వ్యక్తులలో ఒక మహమ్మద్ గౌస్ బాబా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మంథని ప్రాంతంలో హుజురాబాద్ ప్రాంతంలో జగిత్యాల్ ప్రాంతంలో మంచిర్యాలలో ఎసిపిగా పనిచేసే అక్కడి నుండి మళ్ళీ మెట్టుపల్లి ఏసిపిగా పనిచేసినప్పుడు కూడా అక్కడి ప్రజలు ఇప్పటివరకు మహమ్మద్ గౌస్ బాబాను గుర్తిస్తారు ఇంత మంచి అధికారి ఇక్కడ పనిచేసి ఇక్కడ నుండి బదిలీ అవ్వటం చాలా బాధాకరమని ప్రజలు చెప్పుకుంటూ ఉంటారు పేద ప్రజలలో అయిన పని చేసిన ప్రాంతాలలో అక్కడి ప్రజలు ఇప్పటివరకు మొహమ్మద్ గౌస్ బాబాను గుర్తిస్తుంటారు అలాంటి అధికారి ఈరోజు ఎస్సై స్థాయి నుండి అడిషనల్ ఎస్పీ ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొందినారు అంటే ఎంతో సంతోషమని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు

# మేడ్చల్ జిల్లా రైతుల విజయం

**కరుణాకర్ మల్లిగారి, కటపత్రం ప్రతినిధి**




తెలంగాణ ప్రభుత్వం మేడ్చల్ జిల్లా రైతులను గత రెండు దఫాలుగా రైతు భరోసా వేయకుండా బ్లాక్ లిస్టులో పెట్టడం జరిగింది. అది తెలుసుకున్న రైతులు, రైతు నాయకులు, పిఏసిఏ చైర్మన్లు, పిఏసిఎస్ డైరెక్టర్లు కలిసి గౌరవ కలెక్టర్ శ్రీ మిక్కిలినేని ముని చౌదరి గారికి మరియు డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రకళ గారిని కలవడం జరిగింది.రింగ్ రోడ్డుకు దగ్గర ఉన్న మేము వ్యవసాయం చేయడం, వడ్లు పండిస్తున్నాము, కూరగాయలు పండిస్తున్నాము కావున తెలంగాణలో ఉన్న రైతులందరితోపాటు మాకు కూడా రైతు భరోసా నిధులు జమ చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఇట్టి విషయంపై స్పందించి రైతుల అకౌంట్లో రైతు భరోసా నిధులు జమ చేసినందుకు కలెక్టర్ గారికి మరియు జిల్లా వ్యవసాయ అధికారి గారికి రైతుల కృతజ్ఞతలు తెలుపుతున్నాము.రైతు భరోసా నిధులు రావడం కొరకు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞాపనలు పంపిన అందరికీ, మరియు ఇట్టి రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం వరకు చేరేవరకు సహకరించినటువంటి ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా మిత్రులకు రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

# వ్యవసాయాన్ని పండుగగా మార్చింది ప్రజా ప్రభుత్వం..

## -రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగగా మార్చింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా అందోల్ వ్యవసాయ క్లస్టర్, సంగుపేట గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు పండుగ సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ రైతులను ,అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయం దండగ నుంచి పండుగగా మార్చింది ప్రజా ప్రభుత్వమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో 9 రోజుల్లో 9000 కోట్ల రూపాయల రైతు భరోసా పథకంలో భాగంగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయాన్ని జమచేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో 3,12879 మంది రైతుల ఖాతాలలో రూ.383.48 కోట్ల రూపాయలు ఎకరాకు 6000 చొప్పున పెట్టుబడి డబ్బులు రైతు భరోసా పథకం కింద జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రైతు సుభిక్షంగా ఉండేలా కృషి చేస్తున్నదన్నారు. రైతు రాజుగా ఉండేలా, వ్యవసాయాన్ని పండుగలా మార్చే విధంగా ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా పథకంతో పాటు సన్నధాన్యానికి క్వింటాల్ కి రూ. 500 బోనస్, రూ .2 లక్షల రుణమాఫీ లాంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జిల్లాలో రైతు భరోసా 95 శాతం మంది రైతులకు అందజేసినట్లు త్వరలో మిగిలిన ఐదు శాతం మంది రైతులకు కూడా రైతు భరోసా అందించనున్నట్లు ఆయన తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతులు రైతు భరోసా డబ్బులను వినియోగించుకొని నాన్యమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వ గుర్తింపు పొందిన లైసెన్స్ డీలర్ల వద్ద కొనుగోలు చేసి బంగారు పంటలు పండించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో పాండు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు ,రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 24**
స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలని సిపిఎం పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం రోజున జమ్మికుంట మండల కమిటీ సమావేశం కామ్రేడ్ జక్కుల రమేష్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ,పట్టణ కేంద్రంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను అధ్యయనం చేసి ఎక్కడికక్కడ నిర్దిష్ట కార్యాచరణతో ఆందోళన, పోరాటాలు నిర్వహించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు నిరంతర పోరాటాలు చేయాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించాలన్నారు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి ఉద్యోగాలు లేని యువతకు నిరుద్యోగ భృతి కేటాయించాలని డిమాండ్ చేశారు.యాసంగి రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నారు.అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలకు రేషన్ కార్డు అనుసంధానం చేస్తున్నారు కాబట్టి రేషన్ కార్డు లేనటువంటి అర్హులకు వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా అనుకూల నిర్ణయాలను స్వాగతిస్తూనే ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు.పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. మహిళలకు నెలకు 2500 రూపాయలు వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లో పెండింగ్లో ఉన్న రెండవ దఫా దళిత బంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు తయారు చేస్తుందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కూల్ గా గా చేసిందని, కార్మికుల శ్రమను పెట్టుబడుదారులు దోచుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ సామాజిక, ఆర్థిక భద్రతకు విఘాతం కలిగిస్తుందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు తెస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేసిందన్నారు. ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించకుండా దళారుల దోపిడీకి ఊతమిస్తుందన్నారు. దేశంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోయాయి అన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహించాలని సిపిఎం శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జమ్మికుంట మండల కార్యదర్శి శీలం అశోక్, మండల కమిటీ సభ్యులు కన్నం సదానందం, వడ్లూరి కిషోర్, దండి గారి సతీష్, చల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధం:



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జూన్ , జూన్ 24:**
జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు భవన నిర్మాణ కార్మికులు సన్నద్ధమవుతున్నారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ సమ్మెకు పిలుపునిచ్చారు.మంగళవారం రోజు సాయి ప్రతాప్ గార్డెన్స్లో కరీంనగర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కార్మికులపై కక్షపూరితంగా నాలుగు కొత్త కార్మిక చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ కార్మిక చట్టాల వల్ల భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి నిధులు పూర్తిగా లేకుండా పోతాయని, నిధులకు ఎటువంటి హామీ లేకుండా పోతుందని ఆయన అన్నారు.
కార్మికుల ప్రాథమిక హక్కులైన యూనియన్ నమోదు, బేరసారాల హక్కు, సమ్మె హక్కు, కార్మిక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేసే హక్కు, పని గంటలు, కనీస వేతనం, పని భద్రత, సామాజిక భద్రత వంటి అంశాలు ఈ కొత్త కార్మిక చట్టాలలో లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల కేంద్ర ప్రభుత్వం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు, యాజమాన్యాలకు లాభం చేకూరుస్తుందని, భవన నిర్మాణ కార్మికుల నుంచి సెస్సు నిధులు జమ చేయకుండా ఈ చట్టాలను రూపొందించారని విమర్శించారు.
కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, కాబట్టి కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన జూలై 9 దేశవ్యాప్త సమ్మె పిలుపును జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు, అన్ని భవన నిర్మాణ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన, ప్రతి అడ్డా మీద సమ్మె డిమాండ్లను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలియజేసి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అమావాస్య సమావేశాలు, సాధారణ సమావేశాలు నిర్వహించి గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జంబుకం వెంకన్న, పళ్ళ తిరుపతి, రావుల ఎల్లయ్య, రేణుకుంట సారయ్య, సీహెచ్. కొంరయ్య, రాజకుమారి, సర్దన స్వామి, ఉజ్జగిరి సుధాకర్, కాల్వ సమ్మయ్య, దేశబోయిన శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# పైపులైను లీకేజీ తో చెరువును తలపిస్తున్న హై స్కూల్ రహదారి.





**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూన్ 24**
ఇల్లందకుంట మండల కేంద్రంలో మంగళవారం రోజున సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, రోజురోజుకు అభివృద్ధి చెందే మండలం గా ఉండవలసిన ఇల్లంతకుంటలో అధికారుల నిర్లక్ష్యంతో చెరువును తలపిస్తున్న హైస్కూలు రహదారి అని అన్నారు. పైపులైను లీకేజీ తో రహదారి పైన గుంత ఏర్పడి అది చెరువును తలపించే విధంగా ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోవలసిన అధికారులు గాలికి వదిలేయడంతో ప్రజలు తాగే మంచినీరు లీకేజ్ ల ద్వారా మురుగునీరుగా పైపుల ద్వారా రావడం జరుగుతుందని అన్నారు. నిత్యం ఈ రహదారి వెంబడి మండల ఉన్నత అధికారులు విద్యార్థిని ,విద్యార్థులు, గ్రామ ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. గ్రామాల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి అని ప్రజలు బాగుండాలని పరిసరాల పరిశుభ్రత పాటించాలని గొప్పగా చెప్పే అధికారులకు ఈ రహదారి వెంబడి లీకేజీ కనిపించడం లేదా అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ,ఉన్నత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈ పైపులను లీకేజీ మరమ్మతులు చేసి రహదారికి మరమ్మతులు చేయాలని అన్నారు. లేనియెడల ప్రజలను కలుపుకొని ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం, సంక్షేమం కోసం కృషి చేస్తాం - తెలంగాణ ఉద్యమకారుల ఫోరం.



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 24**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జమ్మికుంట మండల కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి నియామాకపు ఉత్తర్వులు అందజేశారు.జమ్మికుంట మండల ఉపాధ్యక్షులుగా యామ రవీందర్, బొమ్మకంటి రవీంద్రాచారి లను, ప్రధాన కార్యదర్శిగా పాకాల మల్లారెడ్డి ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి , యువజన విభాగం రాష్ట్ర కో కన్వీనర్ అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉద్యమకారుల సంక్షేమం కోసం ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం విశేష కృషి చేస్తుందని అన్నారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయత్వంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతమవుతుందని చెప్పారు.
తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గౌరవించాలని అన్నారు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఉద్యమకారుల ఫోరం నిత్యం కృషి చేస్తుందని తెలిపారు.ఉద్యమకారుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ అమలు చేయాలని, ఉద్యమకారుల గుర్తింపు కార్డులు ఇవ్వాలని, దీనికోసం వెంటనే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టఫ్ ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి, టఫ్ రాష్ట్ర కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, మండల అధ్యక్షులు పొట్టాల మల్లేష్, టౌన్ అధ్యక్షులు మారపల్లి అంజన్న, బొమ్మకంటి రవీంద్రాచారి, పాకాల మల్లారెడ్డి,మొగిలి, మల్లయ్య, పవన్, జావేద్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజయశాంతి జన్మదిన శుభాకాంక్షలు

## తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉపాధ్యక్షులు సిలివేరు శ్రీకాంత్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 24**
జమ్మికుంట పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి చేనేత సమైక్య ఉపాధ్యక్షులు సిలివేరు శ్రీకాంత్ నేత మంగళవారం రోజున శాసనమండలి సభ్యురాలు విజయశాంతి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినారు ఈ సందర్భంగా సిలివేరు శ్రీకాంత్ నేత మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లి తెలంగాణ పార్టీని స్థాపించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేసినారని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం శాసనమండలి సభ్యురాలుగా అవకాశం కల్పిస్తానన్నందుకు తల్లి తెలంగాణ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారని జరగబోయే మంత్రివర్గంలో హోం మంత్రిగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కృష్ణమోహన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుమార్ తదితరులున్నారు

# 25 కేజీల బియ్యం అందజేత



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 24:**
గోదావరిఖని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గణేష్ నగర్ నివసిస్తున్న కట్కోజ్వల సదానందం చారికి మంగళవారం వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ బాధ్యులు, పురోహితులు రామోఘల దామోదర్ శర్మ 25 కేజీల బియ్యం బ్యాగ్ ను అందించారు. అనంతరం వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ మాట్లాడారు. గత ఆరు నెలలుగా సదానందం చారి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికి పరిమితమై ఎలాంటి పని చెయ్యని పరిస్థితుల్లో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ తమ సంస్థను సహాయం కోరగా, గోదావరిఖని తిలక్ నగర్ ప్రాంతానికి చెందిన వెలుగు సామాజిక స్వచ్ఛ సంస్థ బాధ్యులు పురోహితులు దామోదర్ శర్మ ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే సదానందం చారికి ఆర్థిక సహాయం అందించాలని దాతలను సురభి శ్రీధర్ కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ బాధ్యులు చందనాల రాజేష్, 45వ డివిజన్ సంస్థ ఆర్గనైజర్ గడవేన సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 24**





జమ్మికుంట మోత్కులగూడెం గ్రామం లో రైతు భరోసా సంబరాలు, రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల్లో 9వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య గఆధ్వర్యంలో, ( సీఎం )రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి స్వీట్స్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, నాయకులు మాట్లాడుతూ, ఇప్పటివరకు ఒక కోటి 49 లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కిలి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి, మంత్రి పొన్నం ప్రభాకర్ కి, మంత్రి శ్రీధర్ బాబుకి, డీసీసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మానకొండూర్ శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ కి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ కి , ధన్యవాదాలు తెలుపుతూ సంబరాలు నిర్వహించామని అన్నారు. ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం ఎకరాకు 12000 చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించడం తో పాటు 500 రూపాయల బోనస్ కొత్త రేషన్ కార్డులు సన్న బియ్యం 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకే గ్యాస్, లాంటి గొప్ప గొప్ప పథకాలు తెలంగాణ ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అందియడం జరుగుతుందని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలలో అత్యధిక విజయాలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో పొనగంటి సురేష్, రాజకొమురు, కుమార్, వెంకన్న, సతీష్ కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు తోట స్వప్న కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, రైతు సోదరులు భారీగా పాల్గొనడం జరిగింది..